## క్లుప్తంగా

### నేడు గోశాలలో కార్తీక దీపోత్సవం

తాండూరు: పట్టణంలోని గోశాలలో ఆదివారం కార్తీక దీపోత్సవం నిర్వహించనున్నట్లు గోశాల సేవా సమితి అధ్యక్ష కార్యదర్శులు పట్లోళ్ల బాల్‌రెడ్డి, కోట్రిక కిరణ్‌కుమార్ తెలిపారు. సాయంత్రం 5.01 గంటలకు గో పూజ, అనంతరం దీపోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. స్థానిక భక్తులు, మహిళలు హాజరై దీపాలు వెలిగించి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### నేటి నుంచి కడ్మూరు శివాలయ వార్షికోత్సవాలు

పూడూరు: మండల పరిధిలోని కడ్మూరు శివాలయ వార్షికోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం నుంచి మంగళవారం వరకు మూడు రోజుల పాటు వేడుకలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

### ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను నిలిపేయాలి



ఉస్మాన్‌అలీకి వినతిపత్రం అందజేస్తున్న మాలమహానాడు నేతలు

కుల్కచర్ల: ఎస్సీ వర్గీకరణను నిలిపేసి, ఆ సామాజికవర్గానికి ప్రత్యేక పథకాలు అమలు చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశ్ అన్నారు. ఈ మేరకు శనివారం నగరంలోని బీఆర్‌కే భవన్‌లో సూపరింటెండెంట్ సయ్యద్ ఉస్మాన్ ఆలీకి వినతిపత్రం అందజేశారు. మాల మహానాడు తరఫున ఎస్సీ వర్గీకరణను వ్యతిరేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, రాజ్‌కుమార్, పోచయ్య, అంజయ్య, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

### ఇద్దరికి ప్రభుత్వ ఉద్యోగాలు

బొంరాస్‌పేట: మండల పరిధిలోని ఏర్పుమళ్లకు చెందిన చల్లా నిర్మలమ్మ, జగన్నాథరెడ్డి కొడుకు శ్రీకాంత్‌రెడ్డి గ్రూప్- 4 ఫలితాల్లో మంచి మార్కులతో, రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించాడు. అగ్నిమాపక శాఖలో కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించిన చల్లా లక్ష్మీకాంత్‌రెడ్డిని గ్రామస్తులు, స్థానిక హెచ్ఎం వెంకట్‌రెడ్డి తదితరులు అభినందించారు.

### జూనియర్ కళాశాలలో నర్సింగ్ కాలేజీ



కళాశాల భవనాన్ని సందర్శించిన కమిషనర్

కొడంగల్: కొడంగల్‌కు మంజూరు అయిన బీఎస్సీ నర్సింగ్ కళాశాల కోసం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశాల మేరకు కొడంగల్ మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ శనివారం కళాశాలను పరిశీలించారు. మరుగుదొడ్లు, స్నానాల గదులు, తరగతి, వసతి గదులు తదితర మౌలిక సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. బీఎస్సీ నర్సింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం 60 సీట్లు భర్తీ చేశారు. త్వరలో తరగతులు ప్రారంభం కానున్నాయి.

### సమగ్రశిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



మహాధర్నాలో పాల్గొన్న కొడంగల్ సమగ్రశిక్ష ఉద్యోగులు

కొడంగల్ రూరల్: సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేయాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కమిటీ శనివారం నగరంలోని ఇందిరాపార్క్, ధర్నా చౌక్‌లో నిర్వహించిన మహాధర్నాకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, తక్షణమే పే స్కేల్ అమలు చేయాలని, జీవిత బీమా, ఆరోగ్య బీమా, ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ రూ.10 లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం నాయకులు రాఘవేందర్, రామకృష్ణ, వెంకటయ్య, సునిత, సరళ, శ్రీనివాస్, దస్తప్ప, శంకరయ్య, వెంకట్‌రావు, నాగరాజు, చంద్రకళ, వేణు, శేఖర్, కృష్ణ పాల్గొన్నారు.

# దారులన్నీ ధారూరు వైపే..

- తండోప తండాలుగా క్రీస్తు ఉత్సవానికి తరలి వస్తున్న భక్తజనం
- ఆటపాటలతో అలరించిన గాయకులు
- నేటితో జనజాతర ముగింపు



తిరుగు ప్రయాణంలో భక్తులు

ధారూరు: దారులన్నీ ధారూరు మెథడిస్టు క్రిస్టియన్ జాతరవైపే కొనసాగుతున్నాయి. క్రీస్తు ఉత్సవానికి యాత్రికులు తరలి వస్తున్నారు. ఈ సందర్భంగా జాతర కమిటీ తెలంగాణ కోషాధికారి స్టీవెన్ రెవరెన్ మార్క్ డీఎస్ మాట్లాడారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు ఏసు శిలువ వద్దకు రావడం ప్రభువు మహిమేనని పేర్కొన్నారు. అయన కృపతోనే శతాబ్దకాలం పైగా.. జాతర విజయవంతంగా కొనసాగుతుందన్నారు. ఈ ఒక్క రోజే సుమారు 1.50 లక్షల మంది యాత్రికులు వచ్చారని తెలిపారు. జాతరకు వచ్చే యాత్రికుల్లో భక్తి, స్నేహభావం పెంపొందుతుందని చెప్పారు. జాతర సమీపానే కాగ్నా నది ప్రవహించడ తమ అదృష్టమన్నారు. అనంతరం క్రీస్తు భక్తి గీతాలు ఆలపించగా.. చిన్నారులు నృత్యం చేసి ఆకట్టుకున్నారు. గతేడాది జాతరకు వచ్చిన యాత్రికులంతా ఉత్సవం పూర్తయ్యే వరకు ఇక్కడే ఉండగా.. ప్రస్తుతం ప్రధాన ఏసుక్రీస్తు శిలువ వద్ద ప్రార్థన అనంతరం తిరుగు ప్రయాణం అవడం గమనార్హం

**నేటితో ముగింపు**

ఆదివారంతో 102వ మెథడిస్టు క్రిస్టియన్ జాతర ఉత్సవాలు ముగియనున్నాయి. శనివారం రాత్రి, ఆదివారం ఉదయం వరకు దాదాపు 2 లక్షల వరకు యాత్రికులు రావచ్చునని నిర్వాహకులు భావిస్తున్నారు. కాగా యాత్రికుల్లో సుమారు 1.50 లక్షల మంది శనివారం సాయంత్రం తిరుగు ప్రయాణం అయ్యారు.



చిన్నారుల సందడి

### భక్తితో ప్రార్థనలు



జాతరకు కాలినడకన వస్తున్న భక్తజనం

జాతర ప్రాంగణంలో ఏసుక్రీస్తు ప్రార్థనలు మిన్నంటయ్యాయి. క్రీస్తు ప్రధాన శిలువ వద్ద కళాకారులతో పాటు చిన్న పిల్లలు పాటలు ఆడిపాడారు. శిలువ వద్ద స్థలం లేకపోవడంతో ప్రవేశ ద్వారం వద్ద నెలకొల్పిన శిలువ వద్ద యాత్రికులు ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా భక్తులను జాతర కోషాధికారి స్టీవెన్, రెవరెన్ మార్క్ డీఎస్‌లు ఆశీర్వదించారు. భక్తులు హుండీలో భారీగా కానుకలు సమర్పించి, కొవ్వొత్తులు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

# రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి
- పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న నేతలు

కుల్కచర్ల: రైతుల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధి ముజాహిద్‌పూర్‌లో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మద్దతు ధర ఇవ్వడంతో పాటు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, నేరుగా అన్నదాతల నుంచి దిగుబడిని సేకరించి, ఎలాంటి జాప్యం చేయకుండా ప్రభుత్వం వారి ఖాతాలో డబ్బును జమ చేస్తుందని పేర్కొన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సొసైటీ డైరెక్టర్ కొండయ్య, నాయకులు చంద్రభూపాల్, ఆనందం, నర్సింహ నాయక్, అంజిలయ్య, అంబయ్య, చంద్రయ్య, నర్సింహులు, షర్ఫొద్దీన్, చిన్న పులింగ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణం కల్పించాలి

సీపీఎం నాయకులు



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

దుద్యాల్: లగచెర్ల ఫార్మా భూ బాధితులకు అధికారులకు మధ్య జరిగిన ఘటన అనంతరం లగచెర్ల, రోటిబండతండా, పులిచెర్లకుంటతండాలో భయానక వాతావరణం నెలకొందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటయ్య, బుస్స చంద్రయ్యలు అన్నారు. వెంటనే ఆయా ప్రాంతాల్లో స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు. శనివారం వారు లగచెర్ల గ్రామస్తులను పరామర్శించడానికి వెళ్తున్న క్రమంలో దుద్యాల్ శివారు లగచెర్ల గ్రామానికి వెళ్లే దారిలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో నాయకులు అక్కడే నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో భయానక పరిస్థితులు ఏర్పడ్డాయని, ప్రజలు స్వేచ్ఛగా తిరగలేకపోతున్నారని తెలిపారు. వారిని పరామర్శించేందుకు వెళ్తున్న వారిని పోలీసులు అడ్డుకోవడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే బాధిత గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం కొడంగల్ తాలూకా అధ్యక్షుడు రమేశ్‌బాబు, సీపీఎం నాయకులు అనంతయ్య, కిష్టప్ప తదితరులు ఉన్నారు.

# రైతు సంక్షేమానికి ప్రాధాన్యత

ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

బంట్వారం: రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వై.మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం బంట్వారం రైతు వేదికలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశంతో కలిసి ఆయన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సహకారంతో వ్యవసాయ మార్కెట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. రూ.5.80 కోట్లతో బంట్వారం, మర్పల్లి, మోమిన్‌పేట, ఎన్కతలలో మార్కెట్ గోడౌన్‌లు నిర్మిస్తామని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి అవసరమైన ప్రభుత్వ స్థలాన్ని త్వరలోనే ఎంపిక చేస్తామని వెల్లడించారు. అనంతరం బంట్వారం మండల కేంద్రంలో మేకల సంత ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశం, ఎంపీపీ మాజీ సభ్యుడు ప్రభాకర్, సొసైటీ వైస్ చైర్మన్ సుధాకర్‌గౌడ్, ఏఎంసీ డైరెక్టర్లు నర్సింహులు, యాదగిరి, ఇసాక్, నాయకులు పురుషోత్తంరెడ్డి, రాములు, శ్రీనివాస్‌రెడ్డి, హరీశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, మున్నాబాయ్ తదితరులు పాల్గొన్నారు.

### పట్టుబట్టి.. కొలువు కొట్టి



ప్రవీణ్‌కుమార్

నవాబుపేట: ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాడు. రెండు సార్లు అదృష్టం దగ్గర దాక వచ్చి చేజారినా పట్టు వీడలేదు. చివరకు గ్రూప్-4లో కొలువు సాధించాడు ప్రవీణ్‌కుమార్. మండల పరిధి ఎల్లకొండ గ్రామానికి చెందిన పెద్దమల్కు కాంతమ్మ వెంకటయ్య దంపతుల కొడుకు ప్రవీణ్‌కుమార్‌ది వ్యవసాయ కుటుంబం. ఎలాగైనా సర్కారు కొలువు సాధించాలనే పట్టుదలతో శ్రమించాడు. రెండు సార్లు కానిస్టేబుల్ ఉద్యోగం కొద్దిపాటి తేడాతో చేజారింది. అయినా నిరాశ చెందకుండా గ్రూప్-4లో అధిక మార్కులతో సీడీఎంఏ శాఖలో జూనియర్ అకౌంటెంట్‌గా ఎంపికయ్యాడు.

# ట్యాంకు నిర్మాణ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్యదర్శి సుగుణ

మోమిన్‌పేట: శిథిలావస్థలో ఉన్న నీటి ట్యాంకును కూల్చివేసి, అదే స్థలంలో నూతనంగా రూ.25 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం చేపడుతున్నామని కార్యదర్శి సుగుణ తెలిపారు. శనివారం మండల పరిధి మేకవనంపల్లిలో ఆమె నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కార్యదర్శి మాట్లాడుతూ.. మిషన్ భగీరథ పథకంలో భాగంగా నిర్మించిన ట్యాంకు నీరు గ్రామ ప్రజలకు సరిపోవడం లేదని, అందుకే కొత్తగా ప్రజా అవసరాలకు అనుగుణంగా.. ట్యాంకు నిర్మాణం చేపట్టినట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

### పట్టు తప్పితే ప్రమాదమే..



గొడుగోనిపల్లి కల్వర్టు సమీపంలో బీటీరోడ్డు దుస్థితి

దోమ: ఇటీవల కురిసిన వర్షాలకు బీటీరోడ్డు కోతకు గురైనా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రాంత ప్రజలు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. వానాకాలంలో మండల పరిధి గొడుగోనిపల్లి సమీప కల్వర్టు వరద నీటితో పొంగిపొర్లింది. వరద దాటికి బీటీరోడ్డు ఇరువైపులా కోతకు గురై.. ప్రమాదకరంగా మారింది. దీంతో ఈ మార్గంగుండా ప్రయాణించే ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఏ మాత్రం పట్టుతప్పినా ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని ఆందోళన చెందుతున్నారు. విషయం సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాహనదారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి, కోతకు గురైన రోడ్డును మరమ్మతు చేయించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### ముమ్మరంగా కుటుంబ సర్వే



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకన్‌గౌడ్

బొంరాస్‌పేట: సామాజిక సమగ్ర కుటుంబ సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సర్వేలో మండల వ్యాప్తంగా ఎన్యుమరేటర్లుగా 120 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఈమేరకు శనివారం ఇంచార్జ్ ఎంపీడీఓ వెంకన్‌గౌడ్ మండల సర్వేను పరిశీలించారు. ఎన్యుమరేటర్లకు ప్రజల నుంచి మంచి సహకారం అందుతోందని తెలిపారు. గడువు లోపు సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు.

# కార్యకర్తలకు అండగా ఉంటాం

కుల్కచర్ల: కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నాయకుడు మందిపల్ గ్రామానికి చెందిన బంగ్రంపల్లి కేశవులు మాతృమూర్తి వసంత మృతిచెందారు. విషయం తెలుసుకున్న కొప్పుల.. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తల కుటుంబాలు, బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఎళ్లప్పుడూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా.. అధైర్య పడవద్దని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాందాస్ నాయక్, పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు చెన్నయ్య, శంకర్, వెంకటయ్య, మాసయ్య ముదిరాజ్, నర్సింలు, సుధీర్, సాయి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

### చేతిపంపునకు మరమ్మతు



చేతి పంపునకు మరమ్మతు చేస్తున్న విజయ్‌కుమార్

కొడంగల్ రూరల్: పట్టణ శివారులోని ఎన్కెపల్లికి వెళ్లే రహదారిలో శేషుగుడి ఆంజనేయస్వామి ఆలయ సమీపాన ఉన్న చేతి పంపునకు శనివారం మున్సిపల్ ఉద్యోగి విజయకుమార్ తదితరులు మరమ్మతులు చేపట్టారు. సమీప పొలాలకు చెందిన రైతులు ఎన్నో ఏళ్లుగా దీన్ని వినియోగించుకుంటున్నారు. చేతిపంపు పాడైపోయిందని రైతులు ఫిర్యాదు చేయడంతో స్పందించిన మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ సిబ్బందిని పంపించి మరమ్మతులు చేయించారు.

### పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

పరిగి: ఈ నెల 17,18 తేదీల్లో నిర్వహించే గ్రూప్-3 పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్ఐ సంతోష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్, పల్లవి డిగ్రీ కళాశాల, న్యూ బ్రిలియంట్ హైస్కూల్, విజ్ఞాన్ జూనియర్ కళాశాల, తుంకలగడ్డలోని ఓగా బీఈడీ కళాశాల పరీక్ష కేంద్రాల పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నామన్నారు. కావున అభ్యర్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున గుంపులుగా ఉండరాదన్నారు. పట్టణ కేంద్రాల్లోని జిరాక్స్ సెంటర్లను మూసి వేయాలని ఆదేశించారు.

### గ్రూప్-4లో సత్తాచాటిన నవీన్‌కుమార్



యాలాల: ఇటీవల విడుదలైన గ్రూప్-4 ఫలితాల్లో మండల పరిధి ఎన్కెపల్లి గ్రామానికి చెందిన యువకుడు ఉద్యోగం సాధించాడు. మాణిక్‌రెడ్డి, విజయలక్ష్మీల కుమారుడు నవీన్‌కుమార్.. వైద్య విధాన పరిషత్ విభాగంలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. నిరుపేద కుటుంబానికి చెందిన యువకుడు.. తొలి ప్రయత్నంలోనే కొలువు సాధించడంతో గ్రామస్తులు, స్నేహితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



జెండా ఊపి టోర్నీ ప్రారంభిస్తున్న క్రిష్ణవేణి

- వారిని అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నాం
- మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి క్రిష్ణవేణి
- జిల్లా స్థాయి ఆటల పోటీలు ప్రారంభం



చెస్ ఆడుతున్న దివ్యాంగులు

అనంతగిరి: దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యమని మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి బి.క్రిష్ణవేణి అన్నారు. వారికి శాఖ తరఫున అన్ని విధాలుగా సహాయం చేస్తామన్నారు. శనివారం వికారాబాద్‌లో బ్లాక్ మైదానంలో వికలాంగులకు జిల్లా స్థాయి ఆటల పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం డిశంబర్ 3ను పురస్కరించుకొని టోర్నీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇలాంటి పోటీలు వారిలో ఆత్మస్థైర్యం పెంపొందిస్తాయన్నారు. శాఖ తరఫున దివ్యాంగులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు. అండర్ 10,16-17,54 రెండు విభాగాలుగా విభజించి షాట్ పుట్, రన్నింగ్, చెస్, క్యారమ్స్ మొదలైన ఆటలు నిర్వహించామని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో గెలుపొందిన వారు రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో బాల రక్ష భవన్ కోఆర్డినేటర్ కాంతారావు, చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రజిత, సీనియర్ అసిస్టెంట్ జహీరుద్దీన్, రాములు, సంగమేశ్వర్, ఎఫ్ఆర్ఓ వెంకటేశ్, ఫిజికల్ డైరెక్టర్స్ ఆశాలత, సురేష్ నాయక్, శ్రీనివాస్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రీ లాంచింగ్‌పై అప్రమత్తంగా ఉండాలి

పంజగుట్ట: కొన్ని రియల్ ఎస్టేట్ సంస్థలు ప్రీ లాంచింగ్ పేరుతో ఎన్నో మోసాలకు పాల్పడుతున్నాయని, అలాంటి సంస్థల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని బంగారు తెలంగాణ రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అన్సార్ హుస్సేన్ అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అసోసియేషన్ గ్రేటర్ కార్యవర్గం ప్రకటించారు. ఈ సందర్భంగా అన్సార్ హుస్సేన్ మాట్లాడు తూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 6 నుంచి 8 లక్షలమంది రియల్ ఎస్టేట్ ఎగ్జిక్యూటీవ్స్ ఉంటారని వీరు కష్టమర్లకు ఎలాంటి అన్యాయం జరగకుండా వారికి అండగా ఉంటారని తెలిపారు. అధికారంలోకి రాగానే జీవో 257 ఎత్తేసి గ్రామ పంచాయతీ లేఔట్‌లపై మిగిలి ఉన్న ప్లాట్స్‌ను రిజిస్ట్రేషన్ చేస్తామని, రియల్ ఎస్టేట్ రంగాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారని కానీ ఇప్పటి వరకు నెరవేర్చకపోవడం దారుణమన్నారు. ఎఫ్‌టీసీ పరిధిలో ఉన్నవాటిని కూల్చివేయడం న్యాయమే కానీ ప్రభుత్వమే అనుమతులు ఇచ్చి, బ్యాంకు రుణాలు ఇచ్చిన వాటిని కూడా కూల్చివేయడం సరికాదన్నారు. ఇలాంటి ఘటనలతో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పూర్తిగా తగ్గుముఖం పట్టిందని తెలిపారు. ప్రభుత్వం హైడ్రాపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. అసోసియేషన్ గ్రేటర్ కా ర్యవర్గం గ్రేటర్ అధ్యక్షునిగా ఎ.ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎమ్.మోహన్, కోశాధికారిగా కె.లక్ష్మీగోపాల్, కోర్ కమిటీ సభ్యులుగా బోగ కోదండపాని, మహ్మద్ తాఫీజ్ అలీ, సరళాదేవి, మహమ్మద్ సర్వర్ పాషా, శివప్రసాద్, గాలయ్య, లీగల్ అడ్వైజర్‌గా హెచ్.గౌరీశంకర్, చీఫ్ అడ్వైజర్‌గా వి.ప్రవీణ్ కుమార్‌లను ఎన్నుకున్నారు.

### మధ్యాహ్న భోజనానికి నిధులు పెంచాలని వినతి

షాద్‌నగర్‌రూరల్: పెరిగిన ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజనానికి సరిపడా నిధులను కేటాయించాలని కోరుతూ శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలకు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత కొరవడుతుందన్నారు. మధ్యాహ్న భోజన పథకానికి సరిపడా నిధులు కేటాయించకపోవడంతో ఒక విద్యార్థికి కేవలం రూ 9.95తోనే సరిపెట్టాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. దీంతో విద్యార్థులకు పోషకాహారం అందడంలేదని పేర్కొన్నారు. నిత్యావసర ధరలు పెరిగిపోయాయని, పెరిగిన ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన పథకానికి తక్షణమే నిధులను పెంచాలని డిమాండ్ చేశారు. లేనియెడలా విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు సుమయిర్, కార్యదర్శి శివశంకర్, నాయకులు అస్మాన్, షైబాజ్ పాల్గొన్నారు.